క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రాక

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని ఎంపీడీఓ రాధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మాల్‌లోని డీసీసీబీ నూతన బ్రాంచ్ ప్రారంభం, మధ్యాహ్నం 12 గంటలకు యాచారంలోని సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో పలువురు అర్హులకు రేషన్‌కార్డుల పంపిణీ, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

ఆమనగల్లులో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నారని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.32 కోట్లతో నిర్మించే 5 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: సీఎంఆర్‌ఎఫ్ నిరు పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం కోల్కులపల్లి గ్రామానికి చెందిన జంగయ్యకు రూ.60 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరు అయ్యాయి. ఈ మేరకు సోమవారం గ్రామంలో బాధితుడికి ఆయన అందజేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేయించుకోవడానికి రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.1.30 లక్షల విరాళం


ఎస్‌ఐకి విరాళం అందజేస్తున్న దాతలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. అదే గ్రామానికి చెందిన ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డిలు రూ.1.30 లక్షలు విరాళాన్ని సోమవారం పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ శేఖర్‌కు అందజేశారు. ఏఎస్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి, సిబ్బంది కృష్ణయ్య, జాషువ, భానుప్రకాశ్, శివుడు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, చంద్రకుమార్, కడారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లక్ష బిల్వార్చన


పూజా కార్యక్రమంలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ అయ్యసాగరంలో వెలసిన త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కొనసాగుతోంది. సోమవారం అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల ఆధ్వర్యంలో బిల్వార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

యూనిఫామ్స్ అందజేత


దాత అందజేసిన దుస్తులతో విద్యార్థులు

కడ్తాల్: క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధి రావిచేడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.40 వేల విలువ గల క్రీడా దుస్తులు, యూనిఫామ్‌లను అందజేశారు. ఎంఈఓ సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

బడంగ్‌పేట్: దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని.. లేని పక్షంలో షాపులను సీజ్ చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ జాన్ కృపాకర్ హెచ్చరించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా 68వ రోజు సోమవారం ఆయన దుకాణాల తనిఖీ చేపట్టారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని, పాత లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోవాలని చెప్పారు. లైసెన్సులు తీసుకోకుండా క్రయవిక్రయాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

ఆయుర్వేదానికి తగ్గిన ఆదరణ!


ముద్వీన్ ఆయుర్వేద వైద్య కేంద్రం

ఆయుర్వేద వైద్యానికి ఆదరణ తగ్గింది. అల్లోపతి సేవలు అంతగా లేని రోజుల్లో కళకళలాడిన వైద్య కేంద్రాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. మొండి రోగాలను సైతం నయం చేయగల ఔషధ గుణాలున్నప్పటికీ.. కాలక్రమేణా ప్రజలు ఆధునిక వైద్యానికి చేరువయ్యారు.

ఆధునిక వైద్యసేవలకే ప్రజల మొగ్గు

- వెలవెలబోతున్న ముద్వీన్ వైద్య కేంద్రం
- సౌకర్యాల లేమి.. సిబ్బంది కొరత
- చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కడ్తాల్: ప్రజారోగ్య దృష్ట్యా సుమారు ఐదు దశాబ్దం క్రితం ముద్వీన్ గ్రామంలో ఆయుర్వేద వైద్య కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పట్లో ఆధునిక వైద్య విధానం అంతగా అందుబాటులో లేక పోవడంతో ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా ప్రజలు.. పురాతన సంప్రదాయ వైద్య సేవలను వినియోగించుకునే వారు. ప్రస్తుతం అల్లోపతి సేవలు విస్తృతం కావడంతో ఇంగ్లిష్ మందులకే రోగులు మక్కువ చూపుతున్నారు.

పోస్టులు ఖాళీ

ముద్వీన్, ఎక్వాయిపల్లి, చరికొండ, నాగిళ్ల, ఆకుతోటపల్లి, కిష్టారాంపల్లి, శెట్టిపల్లి గ్రామాల ప్రజలతో పాటు, సమీప తండాలకు చెందిన గిరిజనులు గతంలో ముద్వీన్ వైద్యశాలలో వైద్య సేవలు పొందేవారు. అల్లోపతి అందుబాటులోకి రావడంతో.. ఆయుర్వేదానికి ప్రాముఖ్యత తగ్గింది. దీంతో వైద్య కేంద్రానికి ప్రజల రాకపోకలు తగ్గడంతో.. చుట్టూ ముళ్లపొదలు పెరిగి దర్శనమిస్తోంది. కొద్దోగొప్పో సేవలు అందిస్తున్నప్పటికీ.. సౌకర్యాల లేమి తదితర సమస్యలతో ఉన్న సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు దాని గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వైద్య కేంద్రంలో వైద్యుడితో పాటు తాత్కాలిక విధానపై అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. ఫార్మాసిస్ట్, ఎంఎన్‌ఓ (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అసాంఘిక కార్యకలాపాలు

ఆయుర్వేద భవనాలు నిర్మించి 50 ఏళ్లు కావడంతో అవి శిథిలావస్థకు చేరువయ్యాయి. పాత భవనం పక్కనే పదేళ్ల క్రితం మరో భవనం నిర్మించినా.. అది కేవలం మందుల నిల్వకు మాత్రమే సరిపోతోంది. ప్రస్తుతం అందులోనే వైద్య సేవలు అందిస్తున్నారు. బోరు మోటారు పనిచేయక నీటి వసతి లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. కేంద్రం చుట్టూ ప్రహరీ లేక.. స్థలం కబ్జాకు గురవడంతో పాటు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ముద్వీన్- చరికొండ ప్రధాన రహదారిపై వైద్య కేంద్రం ఉండటంతో కేంద్రం ఎదుట దుకాణాలు వెలిశాయి. ఈ వైద్య కేంద్రానికి కడ్తాల్ నుంచి వెళ్లాలంటే 16 కిలో మీటర్ల దూరం ఉంటుంది. బస్సు సౌకర్యం అంతంత మాత్రమే. మండల కేంద్రంలో మరో ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు వైద్య సేవలు చేరువవడంతో పాటు.. ఆదరణ పెరిగే అవకాశం ఉంది.

మరో యూనిట్ ఏర్పాటు చేయాలి



కడ్తాల్ మండల కేంద్రంలో అల్లోపతి వైద్యం అందుబాటులో లేదు. ఇక్కడ ఆయుర్వేద కేంద్రం ఏర్పాటు చేయాలి. వారానికి రెండు రోజులు వైద్య సేవలు అందించాలి. ప్రస్తుతం ముద్వీన్‌లో ఉన్న కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి. అక్కడి సమస్యలు పరిష్కరించడంతో పాటు.. సిబ్బందిని నియమించాలి. సాంప్రదాయ వైద్యసేవలను విస్తృతం చేయాలి.

– లాయక్‌అలీ, కడ్తాల్

దుష్ప్రభావాలు ఉండవు



ఆయుర్వేద వైద్యశాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం వైద్య సేవలు అందిస్తున్నాం. ముద్వీన్‌తో పాటు.. పరిసర గ్రామాల ప్రజలు రోజుకు 20 నుంచి 25 మందికి చికిత్స అందజేస్తున్నాం. పురాతన కాలం వైద్యంతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. వైద్య కేంద్రం అభివృద్ధికి గతంలోనే ప్రతిపాదనలు పంపించారు.

– ప్రవీణ్‌కుమార్, వైద్యుడు, ఆయుర్వేద వైద్యశాల, ముద్వీన్

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయ అధికారిణి కవిత



కడ్తాల్: జూన్ 5 తేదీ వరకు పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కవిత అన్నారు. సోమవారం ఆమె మాట్లాడారు. కొత్తగా పాసు పుస్తకం పొంది, 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసున్న వారు.. పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేసి, ఈ నెల 13వ తేదీలోగా మండల వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

రాహుల్ అరెస్ట్ అప్రజాస్వామికం


మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: బీహార్‌లో ఓటర్ల తొలగింపునకు నిరసనగా.. సోమవారం ఢిల్లీలో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన 'పార్లమెంట్ టూ ఈసీ' ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. 'పార్లమెంట్ టూ ఈసీ' కార్యక్రమాన్ని కూటమి సభ్యులతో రాహుల్.. ప్రజాస్వామ్యయుతంగా చేపడితే.. పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాహుల్ సంకల్పాన్ని అణచివేయలేరని, ఆయనకు దేశ ప్రజలంతా అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, యాదయ్యగౌడ్, రామకృష్ణ, జహంగీర్‌అలీ, శంకర్, శేఖర్‌గౌడ్, రాంచందర్‌నాయక్, రామునాయక్, రాజే, వెంకటేశ్, నరేశ్, దస్తగిరి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు మృతి


శ్రీధర్(ఫైల్)

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ నాయకుడు కోట్ల శ్రీధర్(53) అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. మంచాల మండల కేంద్రానికి చెందిన శ్రీధర్.. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. శ్రీధర్ మృతి పట్ల పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీపతిగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం


కొనసాగుతున్న పైపులైన్ పనులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో గత కొన్ని రోజులుగా రోడ్డుపై పారుతున్న మురుగునీటి సమస్యకు అధికారులు పరిష్కార చర్యలు చేపట్టారు. ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి దిగువకు గతంలో వేసిన పైపులైన్ పరిమాణం చిన్నదిగా ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన మురుగునీరు మ్యాన్‌హోల్ నుంచి పైకి ఎగబాకి రోడ్డుపై పారుతూ వచ్చింది. దీంతో బాటసారులకు కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించిన మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పాత లైన్ స్థానంలో పెద్ద సైజ్ పైపులను వేయించారు. ఈ పనులను డీఈ ఇష్రత్ ఆయేషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రతన్ పర్యవేక్షించారు. పనులు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ రవికుమార్ అన్నారు. మండల పరిధి బేగరికంచెలో సోమవారం ఆర్‌బీఐ సౌజన్యంతో వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ, కందుకూరు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జనసురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా.. కేంద్రం బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఎస్‌ఎస్‌వై, ఏపీవై పథకాల గురించి అవగాహన కల్పించారు. జనధన్ ఖాతాల గురించి వివరించారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి

ఏఐసీసీ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ఎడతెరిపి వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ 26,5వ డివిజన్‌లలోని వినాయకహిల్స్-2లోని కాలనీల్లో డీఈఈ వెంకన్న, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీలను పరిశీలించారు. కార్యక్రమంలో వినాయకహిల్స్ ఫేస్-2 ఉపాధ్యక్షుడు శంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, శర్మ, భరత్, మురళీధర్‌రావు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గుప్తా, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, మధురానగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం


ఆమనగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న కమలనాథులు

- హామీల అమలులో విఫలం
- బీజేపీ జాతీయ నేత ఆచారి

ఆమనగల్లు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆరోపించారు. మాట నిలుపుకొనే వరకు ప్రభుత్వంపై బీజేపీ పోరు కొనసాగిస్తుందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందన్నారు. అందుకు స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అందుకే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలంటే ప్రభుత్వం భయపడుతుందని ఎద్దేవా చేశారు. వెంటనే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు వెంటనే పెంచాలని, అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని, రైతుభరోసా కింద ఏడాదికి రూ.15 వేలు అందించాలని, మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఇవ్వాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పోరుబాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, నాయకులు రాంరెడ్డి, లక్ష్మణ్, నర్సింహ, వెంకటయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్‌రావ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవిరాథోడ్, శ్రీకాంత్‌సింగ్ పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు



సభ్యత్వ నమోదులో టీపీయూఎస్ నేతలు

కడ్తాల్: పెండింగ్ డీఏలు, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్)జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, మండల పరిధి పలు పాఠశాలల్లో సంఘం నేతలు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన వారికి వెంటనే పాత పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. అదే విధంగా 2008 డీఎస్సీ వారికి సత్వరమే జీతాలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు యుగంధర్, మండల కార్యవర్గ సభ్యులు మాధవి, గౌరి, శ్రీకాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవకలకు తావులేకుండా వ్యవహరిస్తున్నామని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. సోమవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో 271 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఇందులో 125 ఇళ్లకు గ్రౌండింగ్ చేశామన్నారు. పలు కారణాలతో 142 మంది నిర్మాణానికి ముందుకు రాలేదని తెలిపారు. కొత్తగా వారి జాబితాను కలెక్టర్‌కు పంపించామన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

ఆరోగ్యవంతమైన పిల్లల కోసం..

- నులిపురుగు నివారణకు మాత్రలు తప్పనిసరి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఆమనగల్లు: విద్యార్థినికి మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: నులిపురుగుల నివారణకు విధిగా 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యపై దృష్టి సారించగలుగుతారని చెప్పారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు వైద్యశాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డికి విద్యాలయానికి ప్రహరి నిర్మించాలని, బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ ఎంపీపీ అనిత, వైద్యాధికారులు డా.మైమునాబేగం, జయశ్రీ, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఎస్‌ఐ వెంకటేశ్, కస్తూర్బా ప్రత్యేకాధికారి పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో..

ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వసతిగృహ సంక్షేమాధికారి గోపాల్ ఆధ్వర్యంలో అల్బెండజోల్ పంపిణీ చేశారు. వైద్యాధికారి జయశ్రీ, మైమునాబేగం, డా.శ్రీకాంత్, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామానికి చెందిన యాదగిరి, మౌనికలు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యఖర్చుల కోసం ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.80 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం నగరంలోని తన నివాసంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. పడకల్ మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు భిక్షపతి, నర్సింహారెడ్డి, యాదయ్య, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: కడుపులో క్రిముల వలన పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, వాటి నివారణకు విధిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మాత్రలు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏటీడీఓ వెంకటయ్య, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ నరేశ్‌నాయక్, వార్డెన్లు రాములు, బాలరాజు, వైద్యులు కిరణ్‌కుమార్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎదుగుదలలో లోపం..


నక్కర్తమేడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో.. మాత్రలు వేస్తున్న ఆశ కార్యకర్త

యాచారం: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం అల్బెండజోల్ మాత్రలను వేయాలని ఎంపీడీఓ రాధారాణి సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. చిన్నారుల కడుపుల్లో నులిపురుగులు ఉండడం వలన వారిలో ఎదుగుదల లోపిస్తుందని, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు మాత్రలు వేయాలన్నారు. నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, మాల్, చింతపట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల చిన్నారులకు టాబ్లెట్లు వేశారు.

నులిమేద్దాం..

ఇబ్రహీంపట్నం రూరల్: నులిపురుగులను నలిపేసి, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వర్కాల పరమేష్ అన్నారు. నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నివారణ మాత్రలు వేశారు. నులిపురుగులు కడుపులో చేరి, ఆహారం జీర్ణం కాకుండా చేస్తాయని తెలిపారు. వాటి నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386